

చైతన్యం కల్పించేందుకే 'యువ మంతన్'

ప్రజాశక్తి-అంబాజీపేట

విద్యార్థుల్లో చైతన్యం కల్పించేందుకే యువమంతన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పలువురు ఉపాధ్యాయులు అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో యువమంతన్ 20 కార్యక్రమం శుక్రవారం జరిగింది. సెప్టెంబర్ 9, 10 తేదీల్లో ఢిల్లీలో జరిగే జి 20 సదస్సు సందర్భంగా విద్యార్థులలో చైతన్యం కలిగించుటకు యువమంతన్ 20 విదేశాంగ మంత్రుల సమావేశం పాఠశాలలో నిర్వహించారు. శక్తి వనరులను పొదుపుగా వినియోగించుటపై జీ 20 దేశాల్లో అమలు జరుగుతున్న అంశాలను సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు ఎల్ వెంకటేశ్వర రావు, ఆనంద్ కుమార్, ఉన్నిసా బేగం వివరించారు. ఎపి ఎన్జీసి జిల్లా సమన్వయ కర్త, కె.సాయిరామ్ మాట్లాడుతూ కేంద్ర పర్యావరణ, అటవీశాఖ మంత్రిత్వ శాఖ మరియు ఎపి ఎన్జిసి ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

కౌలు రైతులకు వైఎస్ఆర్ రైతు భరోసా విడుదల

ప్రజాశక్తి - అమలాపురం

కౌలు రైతులకు భరోసాను కల్పిస్తూ వైఎస్ఆర్ రైతు భరోసా పంట పెట్టుబడి సాయం నిధులను ఎస్‌సి, ఎస్‌టి, బిసి వర్గాలకు చెందిన కౌలుదారులకు ఇచ్చేందుకు సంకల్పించిందని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా తెలిపారు. స్థానిక కలెక్టరేట్ కార్యాలయం నుంచి వర్చువల్ విధానంలో జిల్లా కలెక్టర్ వీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పంట రుణ అర్హత కార్డులు కలిగిన కౌలు రైతుల బ్యాంకు ఖాతాలో పెట్టుబడి నిధులను సిఎం జగన్ తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి వర్చువల్ విధానంలో బటన్ నొక్కి జమ చేశారన్నారు. 2023-24 సీజన్‌కు సంబంధించి వైయస్సార్ రైతు భరోసా పెట్టుబడి సాయం నిధులు ఐదవ ఏడాది కౌలు రైతులకు తొలి విడతగా ఒక్కొక్క కౌలు దారు రైతు ఖాతాల్లో రూ.7,500 చొప్పున జమ చేశారన్నారు. రైతు సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్ద పీట వేస్తూ రైతు పక్షపాతిగా ప్రభుత్వం అన్ని రకాలుగా చేయూత నందిస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తొమ్మిది నవరత్న సంక్షేమ పథకాలలో వైఎస్ఆర్ రైతు భరోసా ఒకటన్నారు. ఎస్సీ, ఎస్టీ బీసీ, మైనారిటీ వర్గాలకు చెందిన కౌలు రైతులకు, అటవీ హక్కుల గుర్తింపు చట్టం-2006 గిరిజన రైతు సాగు దారులకు సంవత్సరానికి రూ. 13,500లు రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్ నుంచి ఆర్థిక సహాయం నేరుగా అందించబడుతుందన్నారు. ప్రభుత్వ దేవాదాయ ధర్మాదాయ భూములు వివిధ దేవాలయాల ఇనాం భూముల్లో సాగుచేసే వారు ఈ పథకానికి అర్హులన్నారు. కోనసీమ జిల్లాలో 5,213 మంది ఎస్‌సి, ఎస్‌టి, బిసి వర్గానికి చెందిన కౌలు రైతులు ఉన్నారని, అదే విధంగా దేవాదాయ ధర్మాదాయ భూములను సాగు చేస్తున్న 292 మంది రైతులు ఉన్నారని వెరసి జిల్లా వ్యాప్తంగా 5,505 మంది కౌలుదారు రైతులకు రూ 4 కోట్ల, 12 లక్షల, 87,500 మేర రైతు భరోసా కింద పెట్టుబడి సాయం వరుసగా ఐదవ ఏడాది కూడా పొందారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌సి కుడిపూడి సూర్యనారాయణ రావు, రాష్ట్ర అగ్రి మిషన్ సభ్యులు జిన్నూరి రామారావు, వక్ఫ్ బోర్డ్ ఛైర్‌పర్సన్ షేక్ అబ్దుల్ ఖాదర్, దృశ్యకళల అకాడమీ ఛైర్మన్ కుడుపూడి సత్యశైలజ, జిల్లా వ్యవసాయ సలహా మండలి అధ్యక్షులు మోటూరి సాయి, పురపాలక సంఘ ఛైర్మన్ రెడ్డి సత్యనాగేంద్ర మణి, స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ దంగేటి డోలామణి రుద్ర, ఎంపీపీ కుడిపూడి భాగ్యలక్ష్మి జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఏ బోసుబాబు, జిల్లా ఉద్యాన అధికారి బివి.రమణ, అధికారులు రైతులు పాల్గొన్నారు.


రైతులకు చెక్కు అందజేస్తున్న కలెక్టర్ ఇతర అధికారులు

పెంచిన విద్యుత్ ఛార్జీలు ఉపసంహరించుకోవాలి

సిపిఎం నిరసనలో గుదే దుర్గాప్రసాద్ డిమాండ్

ప్రజాశక్తి - అయినవిల్లి

పెంచిన విద్యుత్ ఛార్జీలు ఉపసవరించుకోవాలని సిపిఎం జిల్లా కమిటి సభ్యులు గుదే దుర్గా ప్రసాద్ డిమాండ్ చేశారు. పెంచిన విద్యుత్ ఛార్జీలు, నిత్యావసర వస్తువుల ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో మండలంలోని వీరవిల్లి పాలెం సచివాలయం వద్ద శుక్రవారం నిరసన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సచివాలయం కార్యదర్శికి పలు డిమాండ్లుతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గుదే దురా ప్రసాద్ మాట్లాడుతూ కేంద్రంలో మతోన్మాద మోడీ ప్రభుత్వం నిరుద్యోగ సమస్యను పరిష్కరించడంలోను, ధరలను అదుపు చేయడంలో ఘోరంగా విఫలమైందని ఆరోపించారు. గద్దెనెక్కిన మొదలు ప్రజా వ్యతిరేక విధానాలను అమలు చేస్తూ కార్పోరేట్లకు, బడా పెట్టుబడిదారులకు రూ.లక్షల కోట్ల రాయితీలు ఇస్తూ పేద, సామాన్య మధ్యతరగతి ప్రజలపై పన్నులు భారాన్ని మోపుతున్నదని విమర్శించారు. ప్రజలకు ఉపాధి కల్పించడంలో విఫలమైన రాష్ట్ర ప్రభుత్వం ప్రజలపై భారాలు వేసేందుకు మాత్రం వెనకాడటం లేదన్నారు. ప్రభుత్వ విధానాలతో ఇప్పటికే ప్రజలు నానా అవస్థలు పడుతుంటే విద్యుత్ వినియోగదారులపై సర్‌ఛార్జీలు, కస్టమర్ ఛార్జీలు, ఫిక్స్ ఛార్జీలు పేర్లతో ప్రజలపై భారాలు వేస్తుందని మండిపడ్డారు. దళితులకు 200 యూనిట్లు వరకు ఉచితంగా విద్యుత్ అని చెప్పి ఆచరణలో అనేక కుంటిసాకులు చూపుతూ ఉచిత విద్యుత్తుకు ఎగనామం పెడుతున్నారని, అలాగే ప్రతి కుటుంబానికి ఏడాదికి 4 సిలిండర్లు ఉచితంగా ఇవ్వాలని, ప్రజా పంపిణీ ద్వారా మంచి నూనె, ఇతర నిత్యావసరాలు పంపిణీ చేయాలని, పెట్రోల్, డీజిల్ ధరలు నియంత్రించి ధరలు తగ్గించాలని, ఖాళీగా ఉన్న గ్రూప్1, గ్రూప్2 పోస్టులను భర్తీ చేయాలని, ఆస్తి పన్ను రిజిస్ట్రేషన్ ఛార్జీలు పెంపు ఉపసంహ రించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో చింతలంక ఒలుపు కార్మికులు ధకారా సత్య ప్రకాష్, తరెట్ల సత్యనారాయణ, వార ప్రకాష్, పెట్టారావు, కాశి సత్యనారాయణ, వాసంశెట్టి శ్రీనివాస్, చికురుమల్లి శ్రీను, మాత అర్జున్‌రావు తదితరులు పాల్గొన్నారు.


సచివాలయ కార్యదర్శికి వినతి పత్రం అందిస్తున్న సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు దుర్గ ప్రసాద్

మాతృమూర్తి మృతదేహం వైద్య పరీక్షలకు దానం

పలువురికి ఆదర్శం అంటున్న ప్రజాసంఘాల నాయకులు

ప్రజాశక్తి-అమలాపురం

సిఐటియు అఖిల భారత ఉపాధ్యక్షురాలు జి.బేబి రాణి మాతృమూర్తి గొసంగి సూర్యకాంతం పార్థీవ దేహాన్ని శుక్రవారం కిమ్స్ మెడికల్ కళాశాలకు అప్పగించారు. వైద్య విద్యార్థుల యనాటమి విద్యకు ఉపయోగపడే విధంగా కుటుంబసభ్యులు, బంధువులు, స్నేహితులు అప్పగించడం అభినందనీయమని కిమ్స్ ఆసుపత్రి అసోసియేట్ ప్రొఫెసర్లు డాక్టర్ వీర్రాజు, డాక్టర్ సుధాకర్, ప్రొఫెసర్లు డాక్టర్ సుభాషిణి, డాక్టర్ నారాయణ తెలిపారు. కోనసీమ ప్రాంతంలో ప్రజలు చైతన్య వంతం కావడానికి సూర్యకాంతం కుటుంబ సభ్యుల నిర్ణయం ఉపయోగ పడుతుందన్నారు. సిఐటియు, వ్యవసాయ కార్మిక సంఘం, సిపిఎం నాయకులు కె.రాజా రామ్మోహన్‌రాయ్, కారెం వెంకటేశ్వరరావు, పిల్లి రామకృష్ణ, పలివెల వీరబాబు, చంద్రమళ్ళ పద్మ, నూకల బలరాం, జి.అప్పారెడ్డి, కాళ్ళ నాగేశ్వరరావు కుటుంబ సభ్యులు సూర్యకాంతం మృత దేహం వద్ద శ్రద్ధాంజలి ఘటించి జోహార్లు అర్పించారు. బేబి రాణి వారి భర్త సూర్యనారాయణ, వారి కుమార్తెలు స్పందన, స్ఫూర్తి సోదరులు, సోదరీమణులు తల్లి ని ఆదరించిన తీరు ఆదర్శంగా ఉందన్నారు. గురువారం ఉదయం కాకినాడ లో బేబి రాణి ఇంటి వద్ద సూర్యకాంతం మరణించిన వెంటనే కాకినాడ ఐ ఫౌండేషన్ కు నేత్రదానం చేశారు. అనంతరం ఆమె స్వగ్రామమైన సాకుర్రు గున్నేపల్లి తీసుకొచ్చారు. శుక్రవారం ఉదయం కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తులతో కలిసి అంతిమయాత్ర గా కిమ్స్ మెడికల్ కళాశాలకు పార్థివ దేహాన్ని అప్పగించారు.ఈ సందర్భంగా సూర్యకాంతం మతి కి పలువురు ప్రజాసంఘాల నాయకులు సంతాపం తెలిపారు.


సూర్యకాంతం పార్థీవదేహానికి నివాళులు అర్పిస్తున్న దృశ్యం

కొత్తగా కళాకారులకు గుర్తింపు కార్డులు

ప్రజాశక్తి-రాజోలు

కొత్తగా 20 మంది కళాకారులకు ప్రభుత్వం మంజూరు చేసిన గుర్తింపు కార్డులను పంపిణీ చేశారు. పొదలాడ ఎస్అర్ఎల్‌జి కళాసమితి భవనంలో శుక్రవారం కళాసమితి అధ్యక్షుడు పుల్లెల ప్రసాద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కడలి సత్యనారాయణ ముఖ్య అతిథిగా పాల్గొని గుర్తింపు కార్డులు పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుర్తింపు కార్డుల వలన కళాకారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు లభించడంతోపాటు సమాజంలో గుర్తింపు వస్తుందన్నారు.కళాసమితి అధ్యక్షుడు పివిఎస్ఎన్.మూర్తి మాట్లాడుతూ కొత్తగా ఇరవై మంది కళాకారులకు ప్రభుత్వ గుర్తింపు కార్డులు లభించాయని అన్నారు. ప్రతీ కళాకారుడికి పెన్షన్ అందాలనే ఎస్అర్ఎల్‌జి కళాసమితి వ్యవస్థాపకులు పుల్లెల కొండయ్య ఆశయ సాధన కోసం కళాసమితి తరుపున కషి చేస్తున్నామని అన్నారు.

ఈ కార్యక్రమంలో వార్డు సభ్యురాలు కోళ్ల సత్యవాణి, స్థానిక నాయకులు కొల్లాబత్తుల సతీష్, కళాసమితి ఉపాధ్యక్షులు కెజెఎమ్. కేశవ స్వామి, ప్రధాన కార్యదర్శి భాస్కర్ల రాజేశ్వరి, కోశాధికారి మద్దుల మణి, కాపిశెట్టి సాయిబాబు, తోలేటి నరసింహా రావు, చుట్టుగుళ్ళ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమానికి చిరునామా టిడిపి

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

అభివృద్ధికి, సంక్షేమానికి చిరునామా టిడిపి అని మాజీ ఎంఎల్ఎ, అమలాపురం నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జ్ అయితాబత్తుల ఆనందరావు విమర్శించారు. ఎన్.కొత్తపల్లిలో 'బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారంటీ' కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఇంటింటికి వెళ్లి చంద్రబాబు ప్రవేశపెట్టనున్న పథకాలు గురించి వివరించి అభివృద్ధి జరగాలంటే చంద్రబాబును సిఎంగా చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు ఆరిగెల నానాజీ, మాజీ జెడ్పిటిసి దేశంశెట్టి లక్ష్మీనారాయణ, నాయకులు లంకే భీమరాజు, గొలకోటి చిన్న, రవణం మధు, నల్లా వెంకటేశ్వరావు, కుచ్చర్లపాటి పెద్దిరాజు, మల్లాడి వెంకట రమణ, ఓలేటి తాతాలు, గుత్తుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. **ఆత్రేయపురం** రాష్ట్ర భవిష్యత్తు చంద్రబాబునాయుడుతోనే ముడిపడి ఉందని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు బండారు సత్యానందరావు అన్నారు మండలంలోని వాడపల్లి గ్రామంలో జరిగిన బాబు ష్యూరిటి భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని వెంకటేశ్వరస్వామి సన్నిధిలో శుక్రవారం ప్రారంభించారు. గ్రామంలో ఇంటింటికి తిరిగి తెలుగుదేశం ప్రభుత్వం వచ్చాకా ప్రతి కుటుంబానికి చేకూరే లబ్ది అధినేత చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు హామీ పత్రాలను అందించామని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నదాత, యువగళం, ఆడబిడ్డ నిధి, ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత గ్యాస్ సిలిండర్లు, తల్లికి వందనం వంటి లబ్దితో తెలుగుదేశం పార్టీ భరోసా ఇస్తుందని తెలిపారు. **అంబాజీపేట** రాష్ట్ర ప్రజల భవిష్యత్తు చంద్రబాబుతోనే సాధ్యమని నియోజకవర్గ కో-కన్వీనర్ నామన రాంబాబు అన్నారు. కె. పెదపూడి నందరపువారి పాలెంలో గ్రామ శాఖ అధ్యక్షులు తిరుమనాథం హనుమంతరావు, పెదపూడి శ్రీనివాసరావుల ఆధ్వర్యంలో శుక్రవారం భవిష్యత్తుకు గ్యారంటీ టిడిపి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు వక్కలంక బుల్లియ్య, డొక్కా నాగబాబు, చిట్టూరి శ్రీనివాస్, మద్దాల సుబ్రహ్మణ్యేశ్వరరావు, తోలేటి సత్తిబాబు, డివివి.సత్యనారాయణ, జివి.రాఘవులు, ఎంపిటిసి పి.పబ్బినిడి రాంబాబు, మందపాటి కిరణ్ కుమార్, సర్పంచ్ నాగబత్తుల శాంతి కుమారి సుబ్బారావు, గోగి రమేష్ తదితరులు పాల్గొన్నారు.


ఎన్.కొత్తపల్లిలో టిడిపి పథకాలను వివరిస్తున్న ఆనందరావు, నాయకులు



యాట్ల నాగేశ్వరరావు

అప్రకటిత విద్యుత్ కోతలను అరికట్టాలి

ప్రజాశక్తి - రామచంద్రపురం

అప్రకటిత విద్యుత్ కోతలను తక్షణమే నివారించాలని బీసీ సంఘం నాయకులు యాట్ల నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఓ ప్రకటనను విడుదల చేశారు. ఒకవైపు ఉష్ణోగ్రతలు పెరిగిపోతుంటే..మరోపక్క ప్రభుత్వం విధుస్తున్న అప్రకటిత విద్యుత్ కోతలతో ప్రజలు నానా ఇక్కట్లు పడుతున్నారని పేర్కొన్నారు. విద్యుత్ సరఫరా నిలిపివేయడంతో రాత్రి సమయంలో ప్రజలు ఇబ్బందులుపడుతున్నారని అన్నారు. గురువారం రాత్రి ఏడు గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేడయంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.ద్రాక్షారామ సబ్ స్టేషన్‌కు ఫోన్ చేస్తే కనీసం సమాధానం చెప్పే దిక్కు లేకుండా పోతుందన్నారు. ఎప్పుడు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తారు? ఎప్పుడు విద్యుత్‌ను సరఫరా చేస్తారనే అంశంపై కనీస సమాచారం లేకుండా ప్రజలను ఇబ్బందులకు గురిచేయడం మంచి ది కాదన్నారు. ప్రజా సమస్యలు పరిష్కరించని పార్టీలపై రాబోయే ఎన్నికల్లో ప్రజలు సరియైన నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

కార్టూ'నిజం'



చిట్టిబ్బాయి సేవలు చిరస్మరణీయం

ప్రజాశక్తి - అమలాపురం

మాజీ ఎంఎల్ఎ కుడిపూడి చిట్టిబ్బాయి సేవలు చిరస్మరణీయమని మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. కుడుపూడి చిట్టిబ్బాయి 75 వ జయంతి సందర్భంగా అమలాపురం సూర్యనగర్ చిట్టిబ్బాయి నివాసంలో ఆయన చిత్రపటానికి పలువురు నాయకులు, పార్టీ కార్యకర్తలు పుష్పాలంకరణ చేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా చిట్టిబ్బాయి పార్టీకి చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో డా పినిపే శ్రీకాంత్, మున్సిపల్ ఛైర్‌పర్సన్ రెడ్డి నాగేంద్ర మణి సత్యనారాయణ, వైసీపీ పట్టణ అధ్యక్షుడు, మున్సిపల్ కౌన్సిలర్ సంసాని బుల్లి నాని, తుని నియోజకవర్గ వైసిపి పరిశీలకులు చెల్లుబోయిన శ్రీనివాసరావు, వైస్ ఛైర్మన్ రుద్రరాజు నాని రాజు తదితరులు పాల్గొన్నారు.

కొత్త పింఛన్ల పంపిణీ

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

గొల్లవిల్లి పంచాయితీ పరిధిలో కొత్తగా మంజూరైన ఏడు పింఛన్లను సర్పంచ్ జొన్నాడ శ్రీదుర్గ అందజేశారు. పంచాయతీ కార్యాలయంలో కొత్తగా మంజూరైన రెండు వద్ధాప్యపు, నాలుగు వితంతు, ఒక వికలాంగ పింఛన్లను శుక్రవారం సర్పంచ్ శ్రీదుర్గ లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో ఎఎంసి డైరెక్టర్ చప్పిడి దుర్గారావు, సచివాలయ కన్వీనర్లు బడుగు అబ్బులు, పోలిశెట్టి వీరబాబు, వైసిపి నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

'ఎఫ్‌డిఒలో భాగస్వాములు కావాలి'


సభ్యత్వం అందిస్తున్న ఛైర్మన్ లాల్ బాబు

ప్రజాశక్తి - మామిడికుదురు(పి.గన్నవరం)

రైతు ఉత్పత్తి దారులందరూ ఫెడ్ ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ (ఎఫ్‌డిఒ)లో భాగస్వాములై తమ ఆదాయం పెంచుకోవాలని కంపెనీ అధ్యక్షులు ఆరుమిల్లి లాల్ బాబు కోరారు. మండలంలోని గంటిపెద పూడిలో డొక్కా సీతమ్మ ఫెడ్ ఫార్మర్ ప్రొడ్యూ సర్ కంపెనీ లిమిటెడ్ సమావేశం శుక్రవారం జరిగింది. విశాఖ కేంద్రంగా భారతీయ విద్యాకేంద్రం అనే స్వచ్ఛంద సంస్థ జిల్లాలో ప్ర ప్రదంగా పి.గన్నవరం మండలంలో ప్రాభించిం దన్నారు. పది మంది డైరెక్టర్లతో రిజిస్ట్రేషన్ అయి (ఎఫ్‌డిఒ)గా నామకరణం జరిగిం దన్నారు. 300 మంది రైతులు భాగ సామ్యంతో సంస్థ నడుస్తుందని, విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, పనిముట్లు కంపెనీ నుంచి రైతులకు సరఫరా చేయ వచ్చన్నారు. మండలంలోని అన్ని గ్రామాల రైతులను భాగస్వాములు చేస్తామన్నారు.ఈ కార్యక్రమంలో యర్రంశెట్టి సాయిబాబు, ఫీల్డ్ కోఆర్డినేటర్ పేరాబత్తుల రామకృష్ణ, రైతు యలమర్తి రంగయ్య లు పాల్గొన్నారు.



సత్యవేణిని సత్కరిస్తున్న దృశ్యం

సత్య వేణికి బార్ కౌన్సిల్ ఘన సన్మానం

ప్రజాశక్తి - రామచంద్రపురం

రామచంద్రపురం బార్ అసోసియేషన్ కార్యవర్గం మహిళా ప్రతినిధి సీనియర్ న్యాయవాది కె.వి సత్యవేణి పురపాలక సంఘ స్టాండింగ్ కౌన్సిల్ సభ్యులుగా నియమించడం పట్ల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పిల్లి మురళీమోహన వెంకటరమణ ఆధ్వర్యంలో న్యాయవాదులు శుక్రవారం ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సెక్రెటరీ వాడ్రేవు సాయి ప్రసాద్ మాజీ ఏజి, పి కెవివి సత్యనారాయణ, బి వినయ్ బాబు, చోడి జాన్ రత్నం, కె. భరత్ కుమార్, సన్నపు కుమార్ స్వామి, సూరంపూడి గంగాధర్, పిల్ల పద్మి రామయ్య తదితరులు పాల్గొని సత్యవేణిని అభినందించారు.


రావులమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న వైసిపి నాయకులు

ఎంఎల్ఎ కొండేటి కోలుకోవాలంటూ పూజలు

ప్రజాశక్తి - అంబాజీపేట

అస్వస్థతకు గురై హైదరాబాద్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఎంఎల్ఎ కొండేటి చిట్టిబాబు సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలంటూ వైసిపి నాయకులు పూజలు చేశారు. మండలంలోని వాకలగరువు గ్రామ దేవత రావులమ్మ తల్లి ఆలయంలో వైసిపి నాయకులు చప్పిడి రాజు, వాకపల్లి శ్రీనివాసరావు ల ఆద్వర్యంలో పూజలు, చర్చిలో పార్థనలు చేశారు. వైసిపి మండల పార్టీ కార్యదర్శి నాగవరపు నాగరాజు ఆద్వర్యంలో అంబాజీపేట మసీదులో పార్థనలు చేశారు. చిరతపూడిలో వైస్ ఎంపిపి నేతల నాగరాజు, గ్రామ శాఖ పార్టీ ఆద్వర్యంలో కనకదుర్గమ్మ ఆలయంలో పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కేశనకుర్రులో రోడ్లుకు శంకుస్థాపన

ప్రజాశక్తి - ఐ.పోలవరం

మేండలంలోని కేశనకుర్రు గ్రామం పంచాయతీ పరిధిలో రూ.19 లక్షలతో నిర్మిస్తున్న పలు సిసి రోడ్లకు శంకుస్థాపన జరిగింది. ఈ శంకుస్థాపన కార్యక్రమం ఎంపిపి మోర్త రాణి మిరియం జ్యోతి సమక్షంలో శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా 15వ వార్డు పుగాకులంక 110 మీటర్లు, చిన్న కేశనకుర్రు -పల్లిగూడెం 240 మీటర్లు సిసి రోడ్ల నిర్మాణాలకు జెడ్పిటిసి ముదునూరి సతీష్ రాజు శంకుస్థాన చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ పిన్నమరాజు వెంకటపతిరాజు, సొసైటీ ఛైర్ పర్సన్ ఇందుకూరి రంగరాజు, మాజీ జెడ్పిటిసి కాశి పరివాజ్ కుమార్, చెల్లి మల్లికార్జునరావు, పుగాకు వెంకటేశ్వరరావు, పరమట త్రిమూర్తులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

బిసిలకు అన్యాయం చేస్తున్న ప్రభుత్వం

ప్రజాశక్తి - రాజోలు

రాష్ట్ర ప్రభుత్వం బిసిలను ఆర్థికంగా, సామాజికంగా అన్యాయం చేస్తుందని టిడిపి బిసి సెల్ రాష్ట్ర ప్రతినిధి చెల్లుబోయిన శ్రీనివాస్ ఆరోపించారు. స్థానికంగా శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర జనాభాలో 50 శాతం పైగా ఉన్న వెనుకబడిన తరగతులకు గత నాలుగు సంవత్సరాల నుంచి జగన్ ప్రభుత్వం తీవ్రమైన అన్యాయం చేస్తుందన్నారు. చేతివత్తులు, కుల వత్తులు చేసుకుంటూ జీవనం పొందే బీసీల అభివద్ధి, పురోభివద్ధి లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీలు హక్కుగా పొందాల్సిన బిసి సబ్ ప్లాన్ నుంచి స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ల వరకు ప్రతి అంశంలో నిరాదరణకు గురవుతున్నారని, రాష్ట్ర ప్రభుత్వం 56 కార్పొరేషన్లు ఏర్పాటు చేసినా ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదన్నారు. 10 శాతం రిజర్వేషన్ల పునరుద్ధరణకు శాసనసభలో తీర్మానం చేయాలని, అందుకు ఎంపీలు పార్లమెంటులో కేంద్రంపై ఒత్తిడి చేయాలన్నారు. ఆదరణ పథకాన్ని పునరుద్ధరించాలని, జనాభా దామాషా ప్రకారం 56 బీసీ కార్పొరేషన్లకు నిధులు కేటాయించి, ఖర్చుపెట్టాలని బేషరతుగా విదేశీ విద్య పథకాన్ని కొనసాగించాలన్నారు. జీవో నెం. 217 ను రద్దు చేయాలని, బీసీలకు చిన్న, మధ్యతరగతి పరిశ్రమల ఏర్పాటుకు అందించే రాయితీలను పునరుద్ధరించాలన్నారు. బీసీ నేతలపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.


చెల్లుబోయిన శ్రీనివాస్

ఉత్తమ ఉపాధ్యాయినిగా జ్యోతి

ప్రజాశక్తి - ఆత్రేయపురం

మండలంలోని రాజవరం ప్రధాన ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయినిగా పనిచేస్తున్న పి. శాంతి జ్యోతి రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మకమైన ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యారు. పాఠశాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తూ గుణాత్మక విద్యను విద్యార్థులకు ఇచ్చి ఎన్నో శిక్షణా తరగతులకు రిసోర్స్ పర్సన్‌గా వ్యవహరించిన శాంతి జ్యోతి రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును ఈ నెల ఐదో తేదీన విజయవాడలో రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చేతుల మీదుగా అందుకోనున్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నట్లు సర్పంచ్ సలాది ఊర్మిళదేవి అన్నారు. మండలంలోని విలసవిల్లి జగనన్న కాలనీలో 16 కెవిఎ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆమె శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఊర్మిళ దేవి మాట్లాడుతూ గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పనకు సర్పంచ్‌గా తన వంతు కషి చేస్తున్నానని అన్నారు. కార్యక్రమంలో వైసిపి గ్రామ కమిటీ అధ్యక్షుడు సలాది సతీష్, కోలా ఏసు, పుచ్చల ఏసు, పంచాయతీ కార్యదర్శి దాసరి కష్ణాజీ, సచివాలయ ఉద్యోగులు కె.ప్రకాష్, ఉంగరాల నాగేశ్వరరావు, దాసరి శర్మ తదితరులు పాల్గొన్నారు.

'జగన్ సర్కార్‌ను పారదోలేందుకే ప్రజావేదిక'

ప్రజాశక్తి - ఆత్రేయపురం

జగన్ పాలన అంతమొందించేందుకే టిడిపి ప్రజావేదిక కార్యక్రమాన్ని తీసుకొచ్చిందని ఆ పార్టీ ఉపాధ్యక్షులు, నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ బండారు సత్యానందరావు అన్నారు. మండలంలోని వాడపల్లి గ్రామంలో వెంకటేశ్వర స్వామి ఆలయం వద్ద శుక్రవారం ప్రజా వేదిక కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.జగన్ ప్రభుత్వంలో అవినీతి, అరాచకం, క్రైమ్ విచ్చలవిడిగా పెరిగిపోయిందని, వాటిని రాష్ట్రం నుంచి నిర్మూలించడం కోసం తెలుగుదేశం పార్టీ వినూత్న కార్యక్రమాన్ని తీసుకొచ్చిందని అన్నారు..గ్రామాలలో పర్యటించి ప్రజావేదిక ఏర్పాటు చేసి అవినీతి వద్దు, ఆరాచకం వద్దు, క్రైమ్ వద్దు అని ప్రజా సంతకాల సేకరణ చేపడుతున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు వాసిరెడ్డి రాంబాబు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

మారేడుబాకలో మహాశక్తి కార్యక్రమం

ప్రజాశక్తి-మండపేట

మండలంలోని మారేడుబాక గ్రామంలో బాబు షూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా మహాశక్తి కార్యక్రమం గ్రామ టిడిపి అధ్యక్షులు ఆధ్వర్యంలో శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు విడుదల చేసిన మేనిఫెస్టోను వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మహిళా నాయకులు విత్తనాల వాణి శ్రీదేవి, వలి జానీ, నక్కిరెడ్డి కనకవల్లి, పసలపూడి శ్రీనివాసు, రాయుడు గంగరాజు ఉప్పలపాటి వరబాబు, కుక్కల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు


కిషోర్ మృతదేహం

యువకుని దారుణ హత్య

ప్రజాశక్తి - అమలాపురం

అమలాపురం రూరల్ మండలం ఈదరపల్లికి చెందిన పోలిశెట్టి కిషోర్ (30)ను కొంతమంది గుర్తుతెలియని వ్యక్తులు శుక్రవారం హత్య చేశారు. కిషోర్ వెంట ఉన్న అతని స్నేహితుడు అడపా సాయిని తీవ్రంగా గాయపరిచారు. గురువారం రాత్రి గ్రామంలో తలెత్తిన వివాదం నేపథ్యంలో ఈ హత్య జరిగి ఉంటుందని గ్రామస్తులు అనుమానిస్తున్నారు. మతుడు అవివాహితుడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఈదరపల్లి శ్మశానంలో ఉండగా కిషోర్, అతని స్నేహితుడు సాయిపై ప్రత్యర్థి వర్గం దాడి చేశారు. ఈ దాడిలో కిషోర్ మరణించగా సాయి గాయాలతో బయటపడ్డాడు. కిషోర్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పోలీసులు అమలాపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. గాయాల పాలైన అడపా సాయిని అమలాపురం లోని ఆర్థోపెడిక్ ఆసుపత్రికి తరలించి వైద్య సేవలు అందిస్తున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

పాము కాటుతో కౌలు రైతు మృతి

ప్రజాశక్తి - జగ్గంపేట రూరల్

మండలంలోని గుర్రంపాలెంలో శుక్రవారం పాము కాటుతో వ్యక్తి మృతి చెందాడు. జగ్గంపేట ఎఎస్ఐ నూకరాజు తెలిపిన వివరాల ప్రకారం గుర్రంపాలెం గ్రామానికి చెందిన గంజా మోహన్ రావు (49) కౌలు చేస్తున్న పొలానికి నీరు పెడుతుండగా పాము కాటేసింది. మోహన్ రావు ఇంటికి వచ్చి కుమారునికి విషయం చెప్పగా, కుమారుడు చికిత్స కోసం ఆసుపత్రికి తీసుకొని వెళ్లేసరికి మార్గం మధ్యలో చనిపోయినట్టు వైద్యులు నిర్ధారించారు.

అన్ని రకాల పోషకాహారం అవసరం

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

చక్కని ఆరోగ్య శైలి కోసం అన్ని రకాల పోషకాలతో కూడిన మంచి ఆహారం తీసుకోవాలని ప్రకతి వైద్య నిపుణులు డాక్టర్ వేదుల శ్రీరామ శర్మ పేర్కొన్నారు. సర్పవరం జంక్షన్‌లో బోట్ క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో పౌష్టికాహార వారోత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నేడు మనకు లభించే అన్ని ఆహార పదార్థాలు ఎరువులు, క్రిమిసంహారక మందుల కల్తీతో లభించడంతో ఫంగల్ ఇన్ఫెక్షన్లు, కొన్ని రకాల క్యాన్సర్లకు దారితీస్తున్నాయని అన్నారు. దీని నివారణకు గాను ఆకుకూరలను ఉప్పు నీళ్లలో శుభ్రపరచాలన్నారు. అల్పాహారంగా సీజనల్ పండ్లను తీసుకోవాలని అన్నారు. మధ్యాహ్నం ఖనిజ లవణాలు గల ఏదైనా ఆహార పదార్థాలను తీసుకోవాలని డాక్టర్ వేదుల తెలిపారు. ఈ కార్యక్రమంలో అడబాల రత్న ప్రసాద్, రాఘవరావు తదితరులు పాల్గొన్నారు.


భోజనాలు వడ్డిస్తున్న సుంకర పావని

లోకేష్ యాత్రతో వైసిపి నాయకులకు వణుకు

ప్రజాశక్తి-కాకినాడ

తమ నాయకుడు నారా లోకేష్ చేస్తున్న పాదయాత్ర వైసిపి నాయకులకు వణుకు పుట్టిస్తోందని కాకినాడ మాజీ మేయర్, టిడిపి జిల్లా మహిళా అధ్యక్షురాలు సుంకర పావని అన్నారు. లోకేష్ యువగళం పాదయాత్ర 200 రోజులు పూర్తయిన నేపథ్యంలో 40వ డివిజన్ స్థానిక వివేకానంద పార్క్ సెంటర్, ఎన్టీఆర్ క్యాంటీన్ వద్ద సుంకర పావని ఆధ్వర్యంలో 300 మందికి భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సుంకర పావని మాట్లాడుతూ లోకేష్ పాదయాత్ర ఎండనక వాననకా 200 రోజులకు చేరుకుందన్నారు. పాదయాత్రలో లోకేష్‌కు వస్తున్న స్పందనకు వైసిపి ప్రభుత్వం బెంబేలెత్తుతోందన్నారు.

47 మందికి ఒటిఎస్ బాండ్లు పంపిణీ

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక నాగమ్మపేటలోని 14వ సచివాలయంలో శుక్రవారం మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్ ఒటిఎస్ లబ్ధిదారులకు బాండ్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ప్రభుత్వం ఇచ్చిన స్థలంలో గహ నిర్మాణ సంస్థ రుణ సహాయంతో ఇల్లు నిర్మించుకున్న లబ్ధిదారులు రుణం రద్దు, పట్టాపై పూర్తి హక్కుల కోసం రూ.15 వేలు చెల్లించారన్నారు. వీరిలో 47 మందికి పూర్తి హక్కులతో రిజిస్ట్రేషన్ పట్టాలు పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు బొబ్బిలి హరిబాబు, పప్పల దుర్గారావు, విడదాసరి నాగేంద్ర, సచివాలయం ఎడ్మిన్ ఎ.రవికిరణ్, కౌన్సిల్ కోఆప్షన్ సభ్యుడు వాసంశెట్టి గంగ, చింతా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

'ఆశ్రమ్'లో కాలం చెల్లిన పానీయాలు

ప్రజాశక్తి కాకినాడ రూరల్

స్థానిక నాగమల్లితోట ఆశ్రమ్ పబ్లిక్ స్కూల్ స్పోర్ట్స్ డే సందర్భంగా శుక్రవారం ఆటల పోటీలు నిర్వహించారు. ఈ సమయంలో విద్యార్థులకు కాలం చెల్లిన టాటా గ్లోకోజ్ శీతల పానీయాలు అందించారు. ఈ విషయాన్ని విద్యార్థులు గుర్తించి పాఠశాల యాజమాన్యానికి తెలియజేయడంతో వెనువెంటనే ఆ పానీయాలను సేకరించి తనిఖీ అధికారులర, పోలీసులకు సమాచారం అందించారు. ఆహార భద్రతా ఉమ్మడి జిల్లా అధికారి శ్రీనివాస్, ఫుడ్ ఇన్స్పెక్టర్ కెవి.సుబ్బారావు, ఎంఇఒం ఎల్.గణేష్ బాబు, పోలీస్ సిబ్బంది స్కూలుకు చేరుకున్నారు. ఆహార భద్రతా అధికారి శ్రీనివాస్ మాట్లాడుతూ పిల్లలకు అందించిన శీతల పానీయాలు 4 రోజుల ముందే కాలం చెల్లినట్లు గుర్తించామన్నారు. వాటిని సరఫరా చేసిన కంపెనీపై, పాఠశాల యాజమాన్యంపై చట్టరీత్యా తగు చర్యలు చెపడతామన్నారు. విద్యార్థులంతా ఆరోగ్యంగా ఉన్నట్లు తెలిపారు. ఈ సంఘటనపై తమకు ఆలస్యంగా సమాచారం ఇవ్వడంపై తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

యానాం వార్తలు


బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

వినియోగదారులకు బంపర్ ఆఫర్

ప్రజాశక్తి - యానాం

యానాం నియోజకవర్గంలో ప్రతి వినియోగదారుడు రూ.200 పైగా కొనుగోలు చేసిన జిఎస్‌టి బిల్లు (ఇన్వాయిస్) తీసుకుని నా బిల్లు - నా హక్కు పోర్టల్లో అప్లోడ్ చేస్తే ప్రతి నెలా రూ.పది వేల నుంచి రూ.కోటి వరకు నగదు బహుమతి గెలుచుకునే అవకాశాన్ని కేంద్ర ప్రభుత్వం కల్పిస్తుందని పుదుచ్చేరి సెంట్రల్ జి.ఎస్.టి ప్రిన్సిపల్ కమిషనరు పద్మశ్రీ తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రయోగాత్మకంగా గుజరాత్, హరియాణా, అసోం, దాద్రానగర్ హవేలీ, పుదుచ్చేరిలలో సెప్టెంబరు 1 నుంచి అమల్లోకి తెచ్చింది. ఈ సందర్భంగా గొలగాబత్తుల వారి వీధిలో ఉన్న ట్విల్స్ షోరూమ్‌లో మేరా బిల్ - మేరా అధికార్ కార్యక్రమాన్ని ఆర్ఎఒ మునిస్వామి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నల్లా వెంకన్న, మాజేటి సత్య భాస్కర్, గోపాల కష్ణ పాల్గొన్నారు.

ఘనంగా రక్షా హరికృష్ణ జయంతి

ప్రజాశక్తి - యానాం

యానాం మాజీ ఎంఎల్ఎ రక్షా హరికష్ణ 84వ జయంతిని స్థానిక సమాచార శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఫెర్రీ రోడ్డులో ఉన్న ఆయన విగ్రహానికి యానాం పరిపాలనాధికారి మునిస్వామి, పిడబ్ల్యుడి ఇఇ వీరసెల్వం, సిఇ షణ్ముఖం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన సేవలను వివరించారు. పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు స్థానిక మెట్టకూరు ఫిషర్‌మెన్ పేటలో ఉన్న రక్షా హరికృష్ణ విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం భారీ కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు. ఈ కార్యక్రమంలో మల్లాడి శామ్యూల్, శేరు కృష్ణ పాల్గొన్నారు.


ర్యాలీ చేస్తున్న రీజెన్సీ విద్యార్థులు

ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి - యానాం

ప్లాస్టిక్ వాడటం వల్ల వచ్చే అనర్థాలను వివరిస్తూ యానాం రీజెన్సీ పబ్లిక్ స్కూల్ ఆధ్వర్యంలో వ్యాయామ ఉపాధ్యాయుడు దుర్గారావు అధ్యక్షతన ప్లాస్టిక్ నిషేధంపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ రీజెన్సీ విద్యార్థులు భారీ ర్యాలీని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్లకార్డులు పట్టుకుని సే నో టూ ప్లాస్టిక్ అంటూ నినాదాలు చేస్తూ యానాం పురవీధుల గుండా ర్యాలీని సాగించారు. ప్రాంతీయ పరిపాలనాధికారి కార్యాలయం వద్ద ఆర్ఎఒ మునిస్వామి ర్యాలీని ప్రారంభించారు. ముందుగా పాఠశాల వద్ద ప్లాస్టిక్ వాడకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం టివిఎస్ఎస్వి.ప్రసాదరావు, సిహెచ్.వీరభద్రరావు పాల్గొన్నారు.

ఓటరు సవరణ సర్వే పరిశీలన

ప్రజాశక్తి- సామర్లకోట రూరల్


సర్వేను పరిశీలిస్తున్న ఆర్‌డిఒ సీతారామారావు

ఓటర్ జాబితాల సవరణలపై జరిగిన సర్వే సక్రమంగా ఉందా, లేదా అనే అంశాలపై పెద్దాపురం నియోజకవర్గ ఎన్నికల అధికారి, ఆర్‌డిఒ జె.సీతారామారావు, సహాయ ఎన్నికల అధికారి, మున్సిపల్ కమిషనర్ జె.రామారావు సామర్లకోటలో శుక్రవారం పర్యటించి పరిశీలించారు. పట్టణంలోని గణపతి నగరం భాస్కర్ నగర్ కాలనీ గాంధీనగర్ ప్రాంతాల పరిధిలో ఉన్న అన్ని పోలింగ్ కేంద్రాల పరిధిలోని ఓటర్ జాబితా సవరణ సర్వేపై వారు పరిశీలన జరిపారు. ఈ సందర్భంగా ఎన్నికల అధికారి ఆర్‌డిఒ సీతారామారావు మాట్లాడుతూ ప్రధానంగా ఇప్పటివరకు జరిగిన ఓటర్ జాబితాల సవరణ సర్వేలో ఓట్ల తొలగింపునకు సంబంధించి సరైన కారణాలతో తొలగింపులు నమోదు జరిగిందా, తొలగింపులు ఏమైనా లోపాలు ఉన్నాయని విషయాలను పరిగణలోకి తీసుకుని ఈ పరిశీలన జరుగుతున్నట్లు చెప్పారు. సర్వే బృందం ఇంటింటికీ వెళ్లి సర్వే చేసి వాస్తవిక విషయాలను తెలుసుకునే ఓట్ల తొలగింపు నమోదు చేపట్టారా అనే విషయాలపై పరిశీలిస్తున్నట్టు చెప్పారు. జూలై 21 నుంచి ఆగస్టు 30వ తేది వరకు జరిగిన సర్వే పైనా పరిశీలన జరుపుతున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు ఫణి కుమార్, మున్సిపల్ మేనేజర్ సీరెడ్డి అచ్యుతరాజు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే ప్రజలకు భవిష్యత్తు గ్యారంటీ

ప్రజాశక్తి-గండేపల్లి

చంద్రబాబుతోనే రాష్ట్ర భవిష్యత్తుకు బంగారు బాటలు పడతాయని టిడిపి మండల అధ్యక్షుడు పోతుల మోహన్‌రావు అన్నారు. సుబ్బయ్యమ్మపేటలో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ మహిళల చైతన్య రథయాత్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహాశక్తి చైతన్య రథయాత్ర కమిటీ డాక్టర్ పాలూరి బోసు బాబు, దాపర్తి సీతారామయ్య, కంచుమర్తి రాఘవ మాట్లాడారు. క్లస్టర్ ఇంచార్జ్ అడబాల భాస్కరరావు, కొత్త కొండబాబు, బోండా శ్రీనుబాబు, కుంచే రామకష్ణ, బొండా శ్రీను, అప్పన శ్రీనివాసరావు, లంక రాంబాబు, గొల్లవిల్లి రాజు, బోండా అర్జున్ రావు పోసిన ప్రసాద్, తిప్పన సత్యవతి, పోలినాటి ధర్మానందకుమారి, నక్కిరెడ్డి సూర్యవతి, గుమ్మల్ల అనంతలక్ష్మి, గొల్లవిల్లి శ్రీదేవి, ఎల్లాటి అమ్మాజీ, గెద్దాడ సత్యవేణి, రాపాక లక్ష్మి పాల్గొన్నారు.

విద్యార్థులకు అల్పాహారం పంపిణీ

ప్రజాశక్తి-తొండంగి (అన్నవరం)

తొండంగి మండలం రావికంపాడులో మూడు ప్రభుత్వ పాఠశాలలకు చెందిన సుమారు 270 మంది విద్యార్థులకు అరబిందో ఫార్మా ఫౌండేషన్ సహకారంతో హరేకృష్ణ మూవ్‌మెంట్ ఫౌండేషన్ సెంట్రల్ కిచెన్ నుంచి అల్పాహార పంపిణీ కార్యక్రమాన్ని శుక్రవారం సర్పంచ్ మేడిశెట్టి సుబ్బారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ సంవత్సర కాలంగా తొండంగి, యు.కొత్తపల్లి మండలాల్లోని 43 ప్రభుత్వ పాఠశాలల్లో సుమారు 6000 మంది విద్యార్థులకు అరబిందో సహకారంతో అల్పాహారం పంపిణీ చేస్తున్నట్టు చెప్పారు. మరో మూడు పాఠశాలలకు సేవలను విస్తరిస్తున్నందుకు అరబిందో ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు.

తాగునీరు, పింఛన్ల పంపిణీ పరిశీలన

ప్రజాశక్తి -సామర్లకోట రూరల్

సామర్లకోట మున్సిపాలిటీ పరిధిలో కుళాయిల ద్వారా ప్రజలకు అందిస్తున్న తాగునీరు, సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమాలను మున్సిపల్ కమిషనర్ జె.రామారావు శుక్రవారం పరిశీలించారు. వార్డుల పర్యటనలో భాగంగా ఆయన కుళాయిల్లో వస్తున్న నీటిని తాగి శుద్ధతను పరిశీలించారు. తాగునీటి ఇబ్బందులపై వార్డుల్లో ప్రజలను అడిగి తెలుసుకున్నారు. సెప్టెంబర్ నెల మొదటి రోజు కావడంతో వార్డుల్లో జరుగుతున్న పింఛన్ల పంపిణీని ఆయన పరిశీలించి పలువురికి కొత్త పింఛన్లను అందజేశారు. స్థానిక 13వ వార్డులో సుమారు పదిమందికి కొత్త పింఛన్లను ఏడో నెంబర్ సచివాలయం వద్ద అవార్డు కౌన్సిలర్ నేతల హరిబాబు ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిర్లు పాగా సురేష్ కుమార్, పాలిక కుసుమ చంటిబాబు పాల్గొన్నారు.

యోగాలో రాష్ట్ర స్థాయికి ముగ్గురు ఎంపిక

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

కాకినాడ జెఎన్‌టియుకె గ్రౌండ్స్‌లో జరిగిన యోగా స్టేట్ కాంపిటీషన్స్‌లో ముగ్గురు మహిళా క్రీడాకారులు మాస్టర్స్ విభాగంలో రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. డిఎస్ఎ జిల్లా క్రీడా ప్రాంగణంలో యోగా కోచ్ ఇందిరా దేవి వద్ద శిక్షణ పొందుతున్న వారు వెండి, కాంస్య పతకాలు పొంది స్టేట్ లెవెల్‌కు సెలెక్టయ్యారు. ఎం.ప్రియాంక వెండి పతకం సాధించగా, పి.శ్రీలక్ష్మి, వాసవి కాంస్య పతకాలు సాధించారు. శిక్షణ ఇచ్చిన ఇందిరా దేవి, యోగా కోచ్‌ను కె.శ్రీరమణి, బి.శ్రీనివాస కుమార్ అభినందించారు.

ఘనంగా సామూహిక వ్రతాలు

ప్రజాశక్తి-అన్నవరం

అన్నవరం దేవస్థానం కొండపైన శ్రావణ శుక్రవారం పురస్కరించుకుని దేవస్థానం అధికారులు నిర్వహించిన ఉచిత సామూహిక వ్రతాల్లో అధిక సంఖ్యలో మహిళా భక్తులు పాల్గొన్నారు. శుక్రవారం రామాలయం ప్రాంగణం వద్ద దేవస్థానం ఇఒ ఎస్ ఆజాద్ సమక్షంలో దేవస్థానం వైదిక సిబ్బంది సాంప్రదాయ రీతిలో వ్రతాలు నిర్వహించారు.

బంగాళా పేటలో డ్రైనేజీ నిర్మాణం

ప్రజాశక్తి-గోకవరం

మండల కేంద్రమైన గోకవరం బంగాళాపేటలో రూ.4లక్షలతో డ్రైనేజీ నిర్మాణం చేపడుతున్నట్లు గోకవరం ఎంపిపి సంకరశ్రీవల్లి భర్త సుంకర వీరబాబు తెలిపారు శుక్రవారం ఆయన బంగాళాపేటలకు వెళ్లి వీధులను పరిశీలించారు. బంగాళాపేటలో డ్రైనేజీలు లేక ఇబ్బందులు పడుతున్నామని, డ్రైనేజీలు నిర్మించాలని స్థానికులు సుంకర వీరబాబుకి తెలియజేశారు. వెంటనే స్పందించిన ఆయన జగ్గంపేట ఎంఎల్ఎ జ్యోతుల చంటిబాబు ఆదేశాల మేరకు బంగాళపేటలో రెండు డ్రైనేజీలు నిర్మిస్తామని చెప్పారు. ఈ వారంలో డ్రైనేజీ పనులు ప్రారంభిస్తామన్నారు.

సాంఘిక కార్యకలాపాలపై కఠిన చర్యలు: ఎస్ఐ

ప్రజాశక్తి - ఆలమూరు


మాట్లాడుతున్న ఎస్ఐ శ్రీనివాస్ నాయక్

అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించే వారిపై ఉక్కు పాదం తప్పదని ఆలమూరు ఎస్సై ఎల్.శ్రీనివాస నాయక్ హెచ్చరించారు. ఆలమూరు స్టేషన్‌లో ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన ఆయన పాత్రికేయులతో మాట్లాడారు. మండలంలో సారాయి, గంజాయి వంటి మత్తు పదార్థాల రవాణా, కలిగి ఉన్న వాటిపై గట్టినిఘా ఏర్పాటు చేశామని, పాఠశాలల జోన్లు వద్ద ఆకతాయిలు ద్విచక్ర వాహనాలపై చెక్కర్లు కొట్టినా, బాలికలపై ఈవ్ టీజింగ్ చేసినా చట్టం తన పని తాను చేసుకుపోతుందని హెచ్చరించారు. అలాగే జాతీయ రహదారిపై ప్రయాణం చేసే ప్రతి వాహనదారుడు ప్రమాదాలు నివారించేందుకు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని, ఎక్కువగా జూదాలపై కేసులు నమోదవుతున్నాయని ఇకపై అలాంటి వాటికి దూరంగా ఉండాలని హితవు పలికారు. మహిళలను, బాలికలను ఎవరైనా ఆకతాయిలు ఇబ్బందులకు గురి చేస్తే వెంటనే తనకు సమాచారం అందించాలని కోరారు. ప్రతి మహిళ తమను కాపాడుకోవడానికి సెల్ఫోన్లో దిశ యాప్ ఉండాలని యాప్ లేని వారు ఆయా గ్రామాల్లో సచివాలయాల్లో విధులు నిర్వహిస్తున్న మహిళ పోలీసులను సంప్రదించాలని తెలిపారు. చట్ట నిబంధనలు పాటిస్తూ పోలీసు వారికి సహకరించాలని కోరారు.

అప్రకటిత విద్యుత్ కోతలతో అవస్థలు

ఉండ్రాజవరం : మండలంలో అప్రకటిత విద్యుత్ కోతలతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. సాధారణంగా ఎల్ ఆర్ సమయం రెండు గంటలు. కానీ మండలంలో ఏకధాటిగా సుమారు నాలుగు గంటల పాటు విద్యుత్ కోత కొనసాగుతోంది. ఇది ఒక ఉండ్రాజవరం మండలానికేనా లేక మరెక్కడైనా కొనసాగు తుందా అనే అనుమానం వ్యక్తం చేస్తున్నారు అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని, కోరుకుంటున్నారు.

జనసేన ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

ప్రజాశక్తి - అమలాపురం


రక్తదానం చేస్తున్న రాజబాబు

జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ జన్మదిన వారోత్సవాల్లో భాగంగా బుద్ధాల బ్లడ్ బ్యాంక్ సౌజన్యంతో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని జనసేన పార్టీ అమలాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ శెట్టిబత్తుల రాజబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా శెట్టిబత్తుల రాజబాబు మాట్లాడుతూ జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ పుట్టినరోజు పురష్కరించుకుని సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా రక్తదానంతో మరో ప్రాణం కాపాడాలనే లక్ష్యంతో ప్రతీ ఏటా రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేసి సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. దీనిలో భాగంగా శుక్రవారం నియోజకవర్గంలో రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున జనసైనికులు పాల్గొని రక్తదానం చేయడం జరిగిందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు మహదాస నాగేశ్వరరావు, సూదా చిన్న, ఆకుల బుజ్జి, చిక్కాల సతీష్, గండి స్వామి, సందాడి శ్రీను, బాలయోగి, గొర్తి పవన్, పోనకల ప్రకాష్, జనసైనికులు, వీర మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ధ్యానం పట్ల శ్రద్ధతో ఉండాలి

ప్రజాశక్తి - అమలాపురం రూరల్

అందరూ ధ్యానం పట్ల శ్రద్ధతో ఉండాలని జిల్లా ప్రజా పరిషత్ సీఈఓ, ప్రిన్సిపాల్ డిపిఆర్సి ఎ.రమణా రెడ్డి సూచిం చారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పంచాయతీ కార్య దర్శుల శిక్షణ కార్యక్రమంలో భాగంగా స్థానిక ఎంపిడిఒ, ఎంఈఒ కార్యాల యాల్లో జరు గుతున్న శిక్షణా కేంద్రాలను ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన గత నాలుగు రోజులుగా పంచాయితీ కార్యదర్శులు నేర్చుకున్న వివిధ అంశాలను అడిగి తెలుసు కున్నారు. కార్యదర్శుల నుంచి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. శిక్షణ ఏర్పాట్లు, శిక్షణ జరుగు తీరును నిశితంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ శిక్షణ కార్యదర్శుల భవిష్య త్తుకు ఎంతగానో ఉపయోగకరమని తెలిపారు. వీలైతే ఆరు నెలల కొక సారి శిక్షణ ఇప్పించాలని కార్యదర్శులు సీఈఓను కోరారు. పంచాయతీ కార్యదర్శులకు అందించిన ఆరు కరదీపికలను, అందులోని విషయాలను అడిగి తెలుసు కున్నారు. ముఖ్యంగా లేఔట్స్, స్వమిత్రలపై అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జె. వెంకటేశ్వరరావు, ఎఓపిఎల్. కె. కుమారి, విస్తరణ అధికారి మల్లికార్జునరావు, పాల్గొన్నారు.

అధ్వానంగా పారిశుధ్యం

ప్రజాశక్తి - మండపేట

మండపేట పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో పారిశుద్ధ్యం అధ్వానంగా మారింది. ఎటు చూసినా రోడ్లు, కాలువలు వెంబడి చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. వర్షాలకు తడిసి ఈ చెత్తకుప్పల నుంచి వచ్చే దుర్వాసనను స్థానికులు, ప్రయాణికులు భరించలేక ఇబ్బందులు పడుతున్నారు. స్థానిక బైపాస్ రోడ్డు, ఇందిరా గాంధీ రోడ్డులోని కాలువ చెంతనే చెత్తాచెదారం పేరుకుపోయి పెద్ద పెద్ద గుట్టలుగా కన్పిస్తున్నాయి. వర్షాకాలం నేపథ్యంలో అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చెత్తకుప్పలను తొలగించాలని ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

దిగబడిన రోడ్లతో ప్రజలకు ఇబ్బందులు

ప్రజాశక్తి -మండపేట

మండలంలోని మారేడుబాక గ్రామంలోని మాదిగపేటలో సిసి రోడ్లు దిగిపోయి ప్రమాదకరంగా మారాయి. దీంతో స్థానికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు మధ్యకు విడిపోవడంతో రాత్రి సమయాల్లో ప్రజలు జారిపడుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఇదే మాదిరి జరిగితే తమ ఇంటి నిర్మాణం చేసినప్పుడు తనే గోతులను పూడ్చుకున్నామని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతులు చేపట్టాలని వారు కోరుతున్నారు.

పేరు మార్పు

చెల్లబోయిన శ్రీనివాసు, తండ్రి: చెల్లబోయిన సత్యనారాయణ R/o. డోర్ నెం. 5-89/1, మల్లవానితోట, మడికి గ్రామం, ఆలమూరు మండలం, డా॥బి.ఆర్. అంబేత్కర్ కోనసీమ జిల్లా, A.P-533126. మీరు ఫారమ్‌లో నా పాస్‌పోర్ట్ నంబర్: **M7068438** నా పేరు **చెల్లబోయిన శ్రీనివాస్ (పాత పేరు)** తప్పుగా ప్రస్తావించబడింది, అయితే ఈ రోజు నుండి అన్ని లావాదేవీలు **చెల్లబోయిన శ్రీనివాసు (కొత్త పేరు)** పైనే లావాదేవీలు జరుగుతాయని యావన్మందికీ తెలియజేయడమైనది.

జెఎన్‌టియు ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా బెజవాడ

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

జెఎన్‌టియుకె ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా రూరల్ మండలం తిమ్మాపురం సర్పంచ్ బెజవాడ సత్యనారాయణ నియమితులయ్యారు. ఆయన మూడేళ్లపాటు ఈ పదవిలో కొనసాగుతారు. ఈ సందర్భంగా బెజవాడ మాట్లాడుతూ తనకు ఈ అవకాశం కల్పించిన ఎంఎల్ఎ కురసాల కన్నబాబు, సిఎం వైఎస్.జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. యూనివర్సిటీ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. ఆయనకు పలువురు వైసిపి నాయకులు, కార్యకర్తలు అభినందనలు తెలిపారు.

రామలింగరాజుకు విసి అభినందన

ప్రజాశక్తి-కాకినాడ

జెఎన్టియుకె యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ నరసారావుపేట ట్రిపుల్ ఇ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ ఎం.రామలింగరాజుకు ముంబై ఐఐటి నుంచి నెట్వర్క్స్ ఏరియాలో పుస్తకం రాసేందుకు ఆహ్వానం అందింది. ఆయనకు అధ్యయన ప్రోత్సాహక సెలవును మంజూరు చేస్తూ రిజిస్ట్రార్ ఎల్.సుమలత శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం జివిఆర్.ప్రసాదరాజు ప్రత్యేకంగా అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ఎంతో అనుభవమున్న రామలింగరాజుకు ఈ అవకాశం లభించడం అభినందనీయమన్నారు. రామలింగరాజుని రెక్టార్ కెవి.రమణ, రిజిస్ట్రార్ ఎల్.సుమలత, యుసిఇకె ప్రిన్సిపల్ ఎంహెచ్ఎం.కృష్ణప్రసాద్, వైస్ ప్రిన్సిపల్ యు.వి.రత్నకుమారి, హరిత అభినందనలు తెలియజేశారు.